ప్రజాశక్తి

ఆదివారం 25 మే 2025

అనంతపురం

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రయివేటు దోపిడీ..!

- ఆరోగ్య శ్రీ ఉన్నా అదనపు వసూళ్లే
- నాలుగు ఆసుపత్రులకు జరిమానా

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

జిల్లాలోని కొన్ని ప్రయివేటు ఆసుపత్రుల్లో దోపిడీ రాజ్యమేలుతోంది. ఎవరికైనా ఆరోగ్య బాగోలేదని పోతే ఆస్తులు అమ్ముకునే పరిస్థితులు నెలకొన్నాయి. అది కూడా వైద్యం సక్రమంగా అందించే పరిస్థితుల్లేక ప్రాణాల మీదకు కూడా వస్తున్నాయి. జిల్లాలోని ప్రయివేటు ఆసుపత్రుల దోపిడీ అంశం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలోనూ ఇటీవల చర్చకు రావడం గమనార్హం.

తప్పుడు వైద్యంతో ప్రాణాల మీదకు..

అనంతపురం నగరంలో ఉండే ఒక వ్యక్తి బైకులో వెళ్తూ కిందపడి కాలుకు చిన్నపాటి ఫ్యాక్చర్ అయింది. సదరు వ్యక్తి నగరంలోని ఒక ప్రయివేటు నర్సింగ్ హోంలో ఆపరేషన్ నిమిత్తం వెళ్లాడు. అక్కడి వైద్యులు బెంగళూరు నుంచి నిపుణులొచ్చి వైద్యం అందిస్తారని చెప్పడంతో వైద్యం చేయించుకునేందుకు ఆయన అంగీకరించాడు. బెంగుళూరు నుంచి వస్తారని చెప్పిన నిపునుడు రాకపోవడంతో వారి ఆసుపత్రిలో పని చేస్తున్న వారే శస్త్ర చికిత్స చేశారు. ఆ శస్త్ర చికిత్స వికటించి సదరు వ్యక్తి ప్రాణాల మీదకొచ్చింది. కుటుంబ సభ్యులు వెంటనే హుటాహుటిన బెంగళూరుకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్సలు చేయించుకుని ఆయన ప్రాణాలతో బతికి బయటపడ్డాడు. వికటించిన వైద్యాన్ని సరిచేయడానికి రూ.20 లక్షల వరకు ఖర్చు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మొదట చికిత్సలు చేసిన అనంతలోని కార్పొరేట్ ఆసుపత్రి మాత్రం తమకేమీ సంబంధం లేదన్నట్టుగా మిన్నకుండిపోవడం గమనార్హం.

గుండె జబ్బు లేకున్నా గుండె ఆపరేషన్..!

శెట్టూరు మండలానికి చెందిన ఒక యువకుడు చికిత్స నిమిత్తం అనంతపురంలోని ఓ కార్పొరేట్ ఆసుపత్రికి వెళ్లగా వెంటనే గుండెకు శస్త్రచికిత్స చేయాలని అక్కడి వైద్యులు చెప్పారు. అనుమానం వచ్చి వాళ్లు ఆ ఆసుపత్రిలో కాకుండా బెంగళూరులోని ఒక ప్రయివేటు ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు.. సదరు వ్యక్తికి ఎటువంటి గుండె జబ్బులేదని తేల్చారు. అయితే అనంతలోని కార్పొరేట్ ఆసుపత్రి మాత్రం ఏమీ లేకున్నా ఆరోగ్యశ్రీ కింద చికిత్స చేసి డబ్బులు దండుకునేందుకు సిద్ధపడినట్టు ఆరోపణలున్నాయి.

మొక్కుబడి జరిమానాలతో సరి

పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందివ్వాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం కోట్లు ఖర్చు పెట్టి ఆరోగ్య శ్రీని అమలు చేస్తోంది. అనంతపురం నగరంలోని ప్రయివేటు, కార్పొరేట్ ఆసుపత్రులు మాత్రం ప్రభుత్వమిచ్చే డబ్బులు సరిపోవు... మంచి వైద్యమందివ్వాలి.. అదనంగా డబ్బులు పెట్టుకోవాలని రోగులకు చెబుతున్నారు. రోగులు విధిలేని పరిస్థితుల్లో డబ్బులు చెల్లిస్తున్నారు. ఈ రకంగా చెల్లించి ఆరోపణలొచ్చిన వాటిపై వైద్యఆరోగ్యశాఖ తనిఖీల్లోనూ తేలింది. ఇలా తనిఖీలు నిర్వహించి డిస్ట్రిక్టు డిసిప్లనరీ కమిటీ తేల్చినవే నాలుగు ఆసుపత్రులున్నాయి. ఇందులో సాయిరత్న ఆసుపత్రి రోగి నుంచి ఎనిమిది వేలు అదనంగా వసూలు చేసినట్టు తనిఖీలో తేలడంతో రూ.80 వేలు జరిమానా విధించారు. ఇక కిమ్స్ సవేరా ఆసుపత్రి అదనంగా ఐదు వేలు వసూలు చేసినందుకు రూ.25 వేలు జరిమానా విధించారు. ఎస్ఆర్ ఆసుపత్రి ఆరు వేలు అదనంగా వసూలు చేసినందుకు రూ.30 వేలు జరిమానా విధించారు. ఇలా ఉన్నతాధికారులు సాధారణ జరిమానాలు వేసి సరిపెట్టేస్తున్నారన్న విమర్శలున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వైద్యం పేరుతో దోపిడీ చేస్తున్న కార్పొరేట్ ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

మునగ సాగుకు ప్రోత్సాహం

కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో మునగ సాగుకు మరింత ప్రోత్సహం అందించేలా అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మునగ సాగునకు తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా అధికారులు, డీఆర్డీఏ, వెలుగు సిబ్బందితో శనివారం నాడు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోషక విలువలు కలిగిన, లాభదాయకమైన అంశంగా మునగను గుర్తించాలన్నారు. బ్రహ్మసముద్రం, రాయదుర్గం మండలాల్లో మునగ పంట సాగు ఒక్కో మండలంలో 100 ఎకరాల చొప్పున చేపట్టేందుకు లక్ష్యం నిర్ణయించగా, ఆయా మండలాల్లో 100 ఎకరాలు ఉంటే ప్రాసెసింగ్ సెంటర్లను ఏర్పాటు చేయవచ్చన్నారు. మునగ సాగుకు రైతులు ముందుకు వచ్చేందుకు అవసరమైన అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్డీఏ పీడీ శైలజ, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి ఉమామహేశ్వరమ్మ, పశుసంవర్ధక శాఖ జెడి వెంకటస్వామి, హార్టికల్చర్ డిడి రఘునాథరెడ్డి, ఏడీ ఫిరోజ్ ఖాన్, ప్రకతి వ్యవసాయం డీపీఎం లక్ష్మానాయక్, డిపిఎం గంగాధర్ పాల్గొన్నారు.

ఇంటింటి చెత్త సేకరణపై నిర్లక్ష్యం వద్దు

జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో రోజూ ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమాన్ని నిర్లక్ష్యం చేయకుండా ఖచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇంటింటి చెత్త సేకరణపై వెనుకబడిన పంచాయతీ సెక్రటరీలతో శనివారం నాడు కలెక్టరేట్లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వంద శాతం చెత్త సేకరణే లక్ష్యంగా సంబంధిత సిబ్బంది పని చేయాలన్నారు. అవసరమైన చోట క్లాప్ మిత్రలను నియమించు కోవాలన్నారు. ఈ సమావేశంలో డిఎల్‌పిఒ విజయ్ కుమార్, డిపిఆర్‌సి అధికారి మాధవి, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ల తనిఖీ

అనంతపురం పాత ఆర్డీవో కార్యాలయం కాంపౌండ్ పక్కనున్న ఈవీఎం గోడౌన్లను కలెక్టర్ వినోద్‌కుమార్ శనివారం తనిఖీ చేశారు. అక్కడి భద్రతా చర్యలు, లాక్‌బుక్ కలెక్టర్ పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. గోడౌన్ల వద్ద లోటుపాట్లు లేకుండా భద్రతా చర్యలను పట్టిష్టంగా చేపట్టాలని చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ ఎ.మలోల, ఆర్డీవో కేశవ నాయుడు, కలెక్టరేట్ కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ యుగేశ్వరి దేవి, తహశీల్దార్ హరికుమార్, ఎన్నికల విభాగం డిప్యూటీ తహశీల్దార్ కనకరాజ్ పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

పామిడిలో ఒరిగిన విద్యుత్ స్తంభం

ప్రజాశక్తి-పామిడి

మండలంలోని సుదర్శన్ రోడ్డులో ఉన్న ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వద్ద స్తంభంతో ఒరిగిపోవడంతో ఎప్పుడు కూలుతుందో అని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఈ దారిలో రెండు ప్రయివేటు పాఠశాలలు ఉండటంతోపాటు నిత్యం ప్రజలు, విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. దీనితోడు వాహనాల రాకపోకలు, వ్యవసాయ పొలాలకు రైతులు వెళ్తూ ఉంటారు. ఇలాంటి ప్రదేశంలో ప్రమాదంగా 11 కెవి విద్యుత్ లైన్ స్తంభం వాలి ఉండటంతో భయపడతున్నారు. ప్రభుత్వాసుపత్రి కాంపౌండ్ వాల్‌కు ఆనుకుని డ్రెయినేజీ కాలువకు దగ్గరగా విద్యుత్ స్తంభం ఉంటుంది. అలాంటి స్తంభం ఎప్పుడు కూలుతుందో అని ఆందోళన చెందుతున్నారు. కావున అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాన్ని మార్చాలని స్థానికులు కోరుతున్నారు.

ఒరిగిన విద్యుత్తు స్తంభం పొంచి ఉన్న ప్రమాదం

విలేకరులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

26 నుంచి పోరుబాట

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.శ్రీనివాసులు

ప్రజాశక్తి-గుంతకల్లు

పట్టణంలో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారానికి ఈనెల 26వ తేదీ నుంచి పోరుబాట కార్యక్రమం చేపట్టనున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.శ్రీనివాసులు తెలిపారు. శనివారం స్థానిక హంపిరెడ్డి భవనంలో పార్టీ ముఖ్య నేతల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలం గడుస్తున్నా గుంతకల్లులో అనేక సమస్యలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయన్నారు. దీనికితోడు పట్టణ ప్రాంతాల్లో ఆస్తి పన్ను ప్రస్తుతం ఉన్న దానికంటే 20 శాతం పెంచేందుకు సిబ్బందితో ఇంటింటి సర్వే జూన్ నెల 15వతేదీలోపు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈ నిర్ణయంతో పట్టణ ప్రజలపై రూ.2.13 కోట్ల అదనపు భారం పడుతుందన్నారు. పన్నుల భారం మోపుతున్న అధికారులు ప్రజలకు మౌలిక సదుపాయాలు మాత్రం కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. చిన్నపాటి వర్షానికి మురికి కాలువలు నిండిపోయి మురుగునీరు ఇళ్ల, రోడ్లపైకి వస్తోందన్నారు. వర్షాకాలం వస్తున్న నేపథ్యంలో ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు కాలువ ల్లో పూడికను తీయించాలన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి ఈనెల 26 నుంచి అన్ని వార్డుల్లో పోరుబాట చేపట్టి జూన్ నెల 2వ తేదీన మున్సిపల్ కార్యాలయం ముందు మహాధర్నా నిర్వహించనున్న ట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి మారుతీప్రసాద్, కార్యదర్శివర్గ సభ్యులు సాకే నాగరాజు, కసాపురం రమేష్, రంగమ్మ, సురేంద్ర, ఉలిగప్ప, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లో కుర్చీల మార్పు ..!

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

మున్సిపల్ కార్పొరేషన్ లో పలువురు గుమాస్తాల సీట్లను మారుస్తూ కమిషనర్ బాలస్వామి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు పరిపాలన సౌలభ్యం నిమిత్తం జూనియర్ అసిస్టెంట్ లక్ష్మీనరసింహమూర్తిని రెవెన్యూ విభాగంలో-3 గుమాస్తాగా నియమించారు అలాగే వెంకటేశులును పిజిఆర్ఎస్ సెక్షన్ కు నియమించారు కంట్రోల్ రూమ్ లో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ కృష్ణమూర్తిని పెన్షన్ విభాగంలో హెచ్ వన్ క్లర్క్ గా నియమించారు పిజిఆర్ఎస్ విభాగంలో పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్ నల్లప్పను కమిషనర్ మార్నింగ్ విజిట్ లో పనిచేస్తూ యధావిధిగా విధులు నిర్వహించాలని ఉత్తర్వులు పేర్కొన్నారు అలాగే రెవెన్యూ విభాగంలో ఏ వన్ క్లర్క్ గా పనిచేస్తున్న శ్రీకాంత్ ను కమిషనర్ సిసి టూ గా నియమించారు అలాగే సీనియర్ అసిస్టెంట్ సునీల్ ను ఏ వన్ గుమాస్తాగా రెవెన్యూ విభాగంలో నియమించారు వార్డ్ ఎడ్యుకేషన్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ శ్రీనివాసులును కమిషనర్ సిసివన్‌గా నియమించారు

రూ.75 లక్షలతో విశ్రాంతి ధామమ్

అనంతపురం జిల్లా ప్రభుత్వాసుపత్రి ఏర్పాటుకు శ్రీకారం - భూమిపూజ చేసిన ఎంపీ, ఎమ్మెల్యే

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో రూ.75 లక్షల ఎంపీ నిధులతో విశ్రాంతి ధామం నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఇందుకు సంబంధించి భూమిపూజ కార్యక్రమాన్ని అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం నాడు ఆసుపత్రి ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఆసుపత్రిలో రోగుల రద్దీ ఎక్కువగా ఉండగా, వారితో వచ్చే సహాయకుల కోసం సరైన విశ్రాంతి ప్రాంతం లేని విషయాన్ని తాము గమనించామన్నారు. అందలో భాగంగా ఎంపీ నిధులతో విశ్రాంతి భవనం నిర్మాణ పనులు చేపట్టామన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా ప్రభుత్వాసుపత్రుల్ని మారుస్తున్నామన్నారు. వివిధ ప్రాంతాల నుంచి ఆసుపత్రికి వచ్చే రోగులకు విశ్రాంతి ధామమ్ ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. ఇది పూర్తైన తర్వాత ముంబై తరహాలో డార్మెట్రీ నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అహుడా ఛైర్మన్ టిసి.వరుణ్, కార్మిక సంక్షేమ బోర్డు ఛైర్మన్ వెంకటశివుడు యాదవ్, ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, ఆర్ఎంఒ హేమలత, ఆసుపత్రి అభివద్ధి కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.

భూమి పూజ చేస్తున్న ఎంపీ అంబికా, ఎమ్మెల్యే దగ్గుపాటి

'మహానాడు'కు తరలివెళ్దాం

ఎంపి అంబికా, ఎమ్మెల్యే దగ్గుపాటిప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కడపలో ఈనెల 27 నుంచి జరగనున్న రాష్ట్రస్థాయి తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమానికి పెద్దఎత్తున తరలిరావాలని ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని టిడిపి కార్యాలయంలో మహానాడుకు తరలి వెళ్లేందుకు చేయాల్సిన ఏర్పాట్లపై నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు లక్ష్మీనారాయణతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఇందులోఉ భాగంగా మూడు రోజుల పాటు మహానాడు జరగనున్న నేపథ్యంలో ఏ రోజు అక్కడికి వెళ్లాలి కార్యకర్తలు వచ్చేందుకు వాహనాలు, భోజన సౌకర్యం వంటి వాటి గురించి చర్చించారు. అనంతపురం నియోజకవర్గం నుంచి ఎంత మంది వస్తారన్న దానిపై వివరాలు సేకరించారు. తొలి రోజు పార్టీ సంస్థాగత నిర్మాణంపై దష్టి, రెండో రోజు కూటమి ఏడాది విజయాలపై చర్చ, మూడో రోజు 5 లక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారని నాయకులన్నారు. అందుకే చివరి రోజు బహిరంగసభకు జిల్లా నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నట్టు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి మహానాడు కావడంతో పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నట్టు తెలిపారు. మహానాడుకు వచ్చే కార్యకర్తలకు ఎక్కడా ఇబ్బంది లేకుండా అన్ని కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కోనంకి గంగారామ్, టిడిపి రాష్ట్ర కార్యదర్శులు తలారి ఆదినారాయణ, బుగ్గయ్య చౌదరి, తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీనరసింహ, మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఫిరోజ్‌అహ్మద్, క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామిదాస్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటప్ప, జిల్లా తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు తొండపునాటి రమేష్, టిడిపి నగర ప్రధాన కార్యదర్శి ముక్తియార్, బెస్త సాధికార సమితి రాష్ట్ర నాయకుడు చేపల హరి, మాజీ జడ్పీ ఛైర్మన్ చమన్ సాబ్ తనయుడు, టిడిపి నాయకుడు ఉమర్ ముక్తియార్, టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సమీక్షలో చర్చిస్తున్న ఎంపి, ఎమ్మెల్యే, టిడిపి నాయకులు

కడపలో మహానాడు ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే దగ్గుపాటి

కడప కేంద్రంగా ఈనెల 27వ తేదీ నుంచి జరగనున్న మహానాడుకు సంబంధించిన ఏర్పాట్లను అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పరిశీలించారు. శనివారం సాయంత్రం ఆయన మంత్రులు నిమ్మల రామానాయుడు, బీసీ జనార్దన్ రెడ్డి, ఎమ్మెల్సీ రాంభూపాల్ రెడ్డి, సహచర ఎమ్మెల్యేలు, అనంతపురం ఎడిసిసి బ్యాంక్ ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, ఇతర నాయకులతో కలసి మహానాడుకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు.

డంపింగ్‌యార్డు అవినీతిపై సమగ్ర విచారణకు డిమాండ్

ప్రజాశక్తి-అనంతపురం

విలేకరులతో మాట్లాడుతున్న వైసిపి కార్పొరేటర్లు

అనంతపురంలోని డంపింగ్ యార్డులో జరిగిన అవినీతిపై సమగ్రంగా విచారించాలని వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు, 33వ డివిజన్ కార్పొరేటర్ సాకే చంద్ర డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో కార్పొరేటర్లతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఓవైపు డంపింగ్ యార్డుపై విచారణ జరుగుతుండగానే ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో బయో మైనింగ్‌కు సంబంధించి బిల్లులు చెల్లించాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కోరిన వీడియోను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు నుంచి డంపింగ్ యార్డులో అవినీతి అంటూ బయట మాట్లాడుతున్న దగ్గుపాటి ప్రసాద్, కౌన్సిల్ సమావేశంలో మాత్రం బిల్లులు చెల్లించాలని చెబుతూ 'లోపలా..బయట ఎమ్మెల్యే'గా మారారని అభివర్ణించారు. వైసిపి హయాంలో ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ద్వారా రూ.23 కోట్లతో అనంతపురం డంపింగ్ యార్డులో బయోమైనింగ్ చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటి వరకు రూ.9.58 కోట్లు మాత్రమే బిల్లుల చెల్లింపులు జరిగినట్లు చెప్పారు. ఇందులో వైసీపీ హయాంలో కేవలం రూ.5.36 కోట్లు మాత్రమే బిల్లులు చెల్లించినట్లు స్పష్టం చేశారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. దగ్గుపాటి ప్రసాద్ ఎమ్మెల్యే అయ్యాక రూ.4.22 కోట్ల చెల్లింపులు జరిగాయన్నారు. ఇప్పటికే తాను రూ.70కోట్ల ఎమ్మెల్యే అని దగ్గుపాటి చెప్పుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోందన్నారు. కూటమి పాలనలో డంప్ యార్డు బిల్లుల చెల్లింపులో ఉన్న మతలబు ఏంటని ప్రశ్నించారు. నిజంగా డంప్ యార్డ్‌లో అవినీతి జరిగింటే ఈ 11 నెలల్లో విచారణ చేయించడం చేతకాలేదా? అని ప్రశ్నించారు. 2021లో డంప్ యార్డులో బయోమైనింగ్ ప్రారంభించి 2023లో పూర్తి చేసినట్లు కాంట్రాక్టర్లు చెప్పారని, ఇందుకు సంబంధించి బిల్లులను అధికారులు ప్రాసెస్ చేశారన్నారు. వైసీపీ హయాంలో ఎక్కడా కూడా పూర్తి స్థాయిలో బిల్లులు చెల్లించలేదని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే దగ్గుపాటి చేసిన ఆరోపణలపై విచారణ చేయాలని మేయర్ వసీం కూడా ఇప్పటికే కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారని గుర్తు చేశారు. ఎక్కడైనా అవినీతి జరిగిందని తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాన్నారు. ఇకపోతే ఇటీవల అనంతపురం జెడ్పీ ఛైర్‌పర్సన్ వ్యక్తిగత ఛాంబర్‌లో జగన్ ఫొటో ఉంటే అధికారాన్ని ఉపయోగించి జెడ్పీ సీఈఓను మూడు రోజుల్లో బదిలీ చేశారన్నారు. అదే తరహాలో అధికారాన్ని ఉపయోగించి డంప్ యార్డ్ అవినీతి ఆరోపణలపై పూర్తి స్థాయిలో విచారణ చేయలేరా? అని ప్రశ్నించారు. దగ్గుపాటి ప్రసాద్ చిల్లర రాజకీయాలు మానుకుని ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు దుర్గాదేవి, కమల్‌భూషణ్, శ్రీనివాసులు, వైసీపీ నాయకులు లక్ష్మన్న, దాదాఖలందర్, రామచంద్ర, సాకే కుళ్లాయిస్వామి, కాకర్ల శీన పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతుల్లో ఎస్సీ, ఎస్టీలకు న్యాయం చేయాలని వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఎమ్మెల్యే ఎంఎస్ రాజును సన్మానిస్తున్న ఆర్ఇఫ్ నాయకులు

ఉమ్మడి అనంతపురం జిల్లా గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులు (జడ్పీ) పదోన్నతుల్లో ఎస్సీ, ఎస్టీలకు న్యాయం చేయాలని ఎపి రిజర్వేషన్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఆర్ఇఫ్) రాష్ట్ర అధ్యక్షులు నారాయణనాయక్ డిమాండ్ చేశారు. శనివారం తొలుత ఆర్ఈఎఫ్ ఆధ్వర్యంలో డిఇఒతోపాటు ఎమ్మెల్యే ఎంఎస్ రాజును వేర్వేరుగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లా గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులకు 2 జిఓ అమలు చేసి ఏ క్యాడర్‌కు ఆ క్యాడర్‌లోనే అడాక్వేసిని చూపించి ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలన్నారు. అదేవిధంగా ఒక డీఎస్సీలో సెకండ్ గ్రేట్ టీచర్ (ఎస్‌జిటి)గా ఎంపికై సేవా పుస్తకం ఓపెన్ చేసి, కొన్ని సంవత్సరాల తర్వాత జిల్లా విద్యాశాఖ అధికారి అనుమతితో వేరే డీఎస్సీ రాసి స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఎ) పోస్ట్‌కు ఎంపికై, అదే సేవా పుస్తకం కొనసాగిస్తూ ఒక్కరోజు కూడా సర్వీస్ బ్రేక్ లేకుండా ఉన్నవారికి ఎస్‌జిటి సర్వీస్‌కి పాయింట్‌లు కేటాయించాలన్నారు. రెండుసార్లు రేసులైజేషన్‌కి గురైన వారికి అదనపు పాయింట్‌లు కేటాయించాలన్నారు. సర్వీస్‌కి రావాల్సిన పాయింట్లలో డెసిమల్ నంబర్స్‌తో సహా చూపించాలన్నారు. వీటిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి విద్యాశాఖ మంత్రి, ఉన్నత అధికారులతో చర్చించి న్యాయం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఇఎఫ్ రాష్ట్ర కో కన్వీనర్లు బి.రాజశేఖర్, జార్జ్, ఆర్.మల్లికార్జున, వెంకటేష్‌నాయక్, సూర్యనారాయణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ యూనియన్ నూతన కమిటీ సభ్యులు

మున్సిపల్ యూనియన్ నగర కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం నగరపాలక సంస్థలో పని చేస్తున్న సిఐటియు అనుబంధ మున్సిపల్ యూనియన్ నగర నూతన కమిటీని ఎన్నుకున్నారు. నగర అధ్యక్షులుగా గోపాల్, ప్రధాన కార్యదర్శిగా సాకే తిరుమలేష్, కోశాధికారిగా లక్ష్మీనరసమ్మ, ఉపాధ్యక్షులుగా సాకే లక్ష్మీనారాయణ, కె.నారాయణ, కోనప్ప, హిమాంబీ, రాఘవేంద్రప్రసాద్, సహాయ కార్యదర్శులుగా బండారు ఎర్రిస్వామి, శేషేంద్రకుమార్, పెన్నోబిలేసు, మంత్రి వరలక్ష్మి, జయరామ్, కమిటీ సభ్యులుగా నాగేంద్ర, కుళ్లాయప్ప, మరియమ్మ, నాగలక్ష్మి, నల్లప్ప, భవాని, గీతమ్మ, అరుణమ్మ, కళావతి, నాగేంద్ర, నారాయణస్వామి, కుమార్, రవి, రాధమ్మ, హరిప్రసాద్, టీసీ లక్ష్మీదేవి, పుల్లమ్మ, ప్రభాకర్, పెద్దన్నను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రామిరెడ్డి, నగర రెండు కమిటీల అధ్యక్ష, కార్యదర్శులు ఎస్టీఆర్ శీనా, వెంకటనారాయణ, గురురాజా, ముర్తుజ, మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణ, జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు, కోశాధికారి బత్తల ఆదినారాయణ మాట్లాడుతూ మున్సిపల్ యూనియన్ పోరాటాలకు సిఐటియు ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. కార్మికులందరూ పోరాటాలకు సహకరించి తమ హక్కులను సాధించుకోవడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

చల్లబడిన వాతావరణం..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మే నెల అంటేనే మండే ఎండలు భయపెడుతూ ఉండేవి. అటువంటిది ఈసారి మే నెల రెండవ వారం తరువాత వర్షాలు రావడంతో వాతావరణం చల్లబడింది. ఈ వారం రోజుల్లో ఉమ్మడి అనంత జిల్లాలో ఒక మోస్తరు నుంచి మంచి వర్షాలే పడ్డాయి. రాష్ట్రంలో అత్యధికంగా ఒకే రోజు 143 మిల్లీమీటర్లు పడింది. విడపనకల్లు, వజ్రకరూరుతోపాటు రాయదుర్గం, కళ్యాణదుర్గం ప్రాంతాల్లో మంచి వర్షాలు పడ్డాయి. దీంతో వాగులు, వంకలు ప్రవహించి చెరువుల్లోకి నీరొచ్చి చేరింది. పదును కావడంతో రైతులు దుక్కులు దున్నుతూ పనిలో పడ్డారు. మరో వారం రోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది. అంతలోపు దుక్కులు పూర్తయితే వచ్చే నెలలో వర్షాలు ఇదే రకంగా వస్తే పంటల సాగుకు సమయత్తమయ్యేందుకు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వం విత్తన ధరల సబ్సిడీలు ఖరారు చేసింది. కాని పంపిణీ ఎప్పటి నుంచి అన్నది ఇంకా ప్రకటించలేదు. పంపిణీ సక్రమమైనంత త్వరగా చేపట్టాలని డిమాండ్ రైతుల నుంచి వ్యక్తమవుతోంది.

జిల్లాలో వాతావరణం కూల్‌గా మారినప్పటికీ పొలిటికల్ హీట్ మాత్రం గత వారంలో మరింతగా పెరిగింది. అధికార టిడిపి, వైసిపి నేతల మధ్య మాటల యుద్ధం తారా స్థాయికి చేరుతోంది. ప్రధానంగా జిల్లా పరిషత్ కార్యాలయంలోని ఛైర్‌పర్సన్ ఛాంబర్‌లోకి టిడిపి ఎమ్మెల్యేలు వెళ్లి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఫొటోలు తొలగించడంతోపాటు, అనంతపురం నగర పాలక సంస్థలోని మేయర్ ఛాంబర్‌లోనూ వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఫొటోలు తొలగించడం వివాదాస్పదం అవుతోంది. ప్రజాప్రతినిధుల ఛాంబర్‌లో ఏ ఫొటోలుండాలన్నది వారి ఇష్టాలను బట్టి ఉండే అవకాశముంది. ఉండటానికి వీల్లేదన్నట్లుగా అధికారపార్టీ నేతలు వ్యవహరించడం చర్చనీయాంశం అవుతోంది. దీని కొనసాగింపుగా వైసిపి ఎమ్మెల్సీల తీరుపై ఫిర్యాదు చేయడమే కాకుండా చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ నాయకులు జిల్లా ఎస్పీ జగదీశ్‌కు శనివారం నాడు వినతిపత్రం అందజేశారు.

తాడిపత్రి నియోజకవర్గంలో టిడిపి, వైసిపి మధ్య మాటల యుద్ధమే కాకుండా ప్రత్యక్ష యుద్ధమా కొనసాగే పరిస్థితులు నెలకొన్నాయి. కోర్టు అనుమతి ఉంది.. తాను తాడిపత్రికి వెళ్తానని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చెబుతుండగా, వస్తే అడ్డుకుంటామని మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి హెచ్చరిస్తున్నారు. ఇద్దరి మధ్య పోరు తారా స్థాయికే చేరుతోంది. ఇదే సమయంలో రాయదుర్గం ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి మధ్య హంద్రీనీవాపై మాటల యుద్ధం సాగింది.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నియోజకవర్గాల టిడిపి మహానాడులను ఆ పార్టీ ఆధ్వర్యంలో జరిగాయి. జిల్లా మహానాడులను అనంతపురం, పుట్టపర్తిలో పూర్తి చేశారు. వచ్చే వారం కడపలో జరిగే మహానాడుకు వెళ్లేందుకు ఆయా నియోజకవర్గాల నేతలు సన్నద్ధమవుతున్నారు. వైసిపి కూడా పార్టీ శ్రేణులను సన్నద్ధం చేసేలా పనిలో ఉంది. రాయలసీమ కో ఆర్డినేటరుగా ఉన్న ఎంపి మిథున్‌రెడ్డి అనంతపురం విచ్చేసి ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అవసరమైన సలహాలు, సూచనలిచ్చారు. అధికార పార్టీ నుంచి ఎదురవుతున్న ఇబ్బందులను ఎదురించి ఏ రకంగా ప్రజల్లోకెళ్లి పనిచేయాలని చర్చించినట్లు తెలుస్తోంది. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలకు కూడా పార్టీ శ్రేణులను సమయత్తం చేసేందుకు దిశానిర్దేశం చేసి వెళ్లినట్టు సమాచారం. ఈ రకంగా ఈ వారంలో రాజకీయ వాతావరణం మాత్రం వాడివేడిగా సాగింది.

చెత్త సంపద కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి-నార్పల

చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఇఒఆర్‌డి

మండల పరిధిలోని బి.పప్పూరులో ఉన్న చెత్త సంపద కేంద్రాన్ని ఇఒఆర్‌డి శైలజారాణి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇఒఆర్‌డి మాట్లాడుతూ మండలంలోని అన్ని చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకొచ్చామన్నారు. అదేవిధంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు పొడి, తడి చెత్తపై అవగాహన కల్పించి వేర్వేరుగా చెత్త ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా రోగాలు దరి చేరవన్నారు. అలాగే ప్రతిఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకునేందుకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ నారాయణరెడ్డికి నివాళి

ఉరవకొండ : పేదల పెన్నిధి కామ్రేడ్ రాకెట్ల నారాయణరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని ఉరవకొండ సిపిఐ కార్యాలయంతోపాటు రాకెట్ల గ్రామంలో నారాయణరెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి సమాధుల వద్ద పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి మల్లికార్జున, నారాయణరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు వై.మధుసూదన్‌రెడ్డి, మాట్లాడుతూ అన్యాయాన్ని ప్రశ్నించడం ఆయన నైజం అన్నారు. రైతు కష్టాల్లో పాల్గొంటుంటూ నిరుపేదలకు అండగా నిలిచిన రాకెట్లనారాయణరెడ్డి త్యాగం చిరస్మరణీయం అన్నారు. నివాళులర్పించిన వారిలో నారాయణరెడ్డి మనవడు యువనేత నిఖిల్‌నాథ్‌రెడ్డి, సిపిఐ సీనియర్ నాయకులు శ్రీధర్, నియోజకవర్గ నాయకులు చెన్నారాయుడు, సుల్తాన్, మల్లేష్, వైసిపి నాయకులు అశోక్‌కుమార్, నారాయణరెడ్డి కుటుంబ సభ్యులు ఉన్నారు.

కౌలు రైతుసంఘం అధ్యక్ష, కార్యదర్శులుగా సురేష్, వెంకటేశులు

ప్రజాశక్తి-ఉరవకొండ


విలేకరులతో మాట్లాడుతున్న కౌలు రైతుసంఘం అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, వెంకటేశులు

కౌలు రైతు సంఘం ఉరవకొండ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులుగా రేణుమాకులపల్లి సురేష్, పెద్దముష్టూరు వెంకటేశులు ఎన్నికయ్యారు. కౌలు రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు ఆదేశాల మేరకు నియోజకవర్గ కమిటీని ఎన్నిక చేశారు. అధ్యక్ష, కార్యదర్శులతోపాటు కార్యవర్గ సభ్యులుగా చిన్న ముష్టూరు శివప్ప, సీనప్ప, మోపిడి సిద్ధార్థ, కమిటీ సభ్యులుగా తిమ్మప్ప, నారాయణస్వామి, మురళి, గౌకుంట్ల ధనంజయ, తదితరులను ఎన్నిక చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ నూతన కౌలు రైతు చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎలాంటి షరతులు లేకుండా కేంద్ర ప్రభుత్వంతో సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వమే కౌలు రైతులందరికీ అన్నదాత సుఖీభవ రూ.20 వేలు అందజేయాలన్నారు. సీసీ కార్డులు ఉన్న కౌలు రైతులందరికీ బ్యాంకు రుణాలు ఇవ్వాలని, సబ్సిడీతో విత్తనాలు, పురుగుల మందులు అందజేయాలన్నారు. ముఖ్యంగా ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు కుటుంబాలను గుర్తించి ఒక్కో కుటుంబానికి రూ.10లక్షలు ఇవ్వాలన్నారు. నియోజకవర్గంలోని దేవాలయ భూములతో పాటు భూ యజమానుల వద్ద కౌలుకు చేసే రైతులందరూ ఐకమత్యంతో కలిసి రావాలన్నారు.

అరాచకాలను ప్రోత్సహిస్తున్న చంద్రబాబు

మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

సిఎం చంద్రబాబు ప్రజా శ్రేయస్సును పక్కనపెట్టి కేవలం స్వార్థ రాజకీయాల కోసం పోలీసులను అడ్డుపెట్టుకుని అరాచకాలను ప్రోత్సహిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి మండిపడ్డారు. శనివారం ఉరవకొండలోని వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ విధానాలను అమలు చేస్తోందన్నారు. చంద్రబాబు తన ప్రతిష్ట కోసం పాకులాడుతున్నాడు తప్ప.. రాష్ట్ర ప్రయోజనాలుగానీ, ప్రజా సంక్షేమం కోసం గానీ పట్టలేదని విమర్శించారు. తాను అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తానని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత మోసం చేస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఐఎఎస్, ఐపిఎస్ అధికారులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడడం సరైన పద్ధతి కాదన్నారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ఛాంబర్‌లో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఫొటో ఉందన్న కారణంతో టిడిపి ఎమ్మెల్యేలు విచక్షణ కోల్పోయి చొరబడడం సమంజసం కాదన్నారు. ఇకపోతే నియోజకవర్గంలో రాష్ట్ర ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ తన చేతికి మట్టి అంటకుండా పోలీసులను అడ్డుపెట్టుకుని గ్రామస్థాయి నుంచి నియోజకవర్గస్థాయిలో ఉన్న వైసిపి నాయకులను స్టేషన్లకు పిలిపించి అక్రమ కేసులు బనయించి భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా కూటమి ప్రభుత్వం అండతో పోలీసులు చేస్తున్న అరాచకాలపై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి నరసింహులు, సర్పంచు జగదీష్, వైసిపి నాయకులు వీరన్న, ఈడిగ ప్రసాద్, ఎసి ఎర్రిస్వామి, బసవరాజు, కరణం భీమిరెడ్డి, తిప్పయ్య, ఎర్రిస్వామిరెడ్డి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

27, 28న కిడ్స్ బైబిల్ సమ్మర్ క్యాంపు

పోస్టర్లను విడుదల చేస్తున్న పాస్టర్, తదితరులు

రాయదుర్గం : పట్టణంలోని రాజీవ్‌గాంధీ కాలనీలోని కింగ్ ఆఫ్ షాలేమ్ క్రైస్ట్ చర్చిలో ఈనెల 27, 28వతేదీల్లో కిడ్స్ సమ్మర్ బైబిల్ క్యాంప్ నిర్వహించనున్నట్లు రాయదుర్గం పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు పాస్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. ఈమేరకు శనివారం ఇందుకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా చిన్నపిల్లలకు బైబిల్ పాఠాలతోపాటు క్రమశిక్షణ నైతిక విలువలు, తోటి వారితో సమాజంలో ఎలా మెలగాలనే విషయాలు నేర్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చర్చి అభివృద్ధి కమిటీ మండలి సభ్యులు రాజశేఖర్, రామాంజి, చిన్నబాబు, మురళి, సండే స్కూల్ టీచర్లు, రేణుకమ్మ, నాగవేణి, రూతు పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తు చేసుకోండి

యల్లనూరు : పదో తరగతి పరీక్షల ఫలితాల్లో జిల్లాలో 550పైన మార్కులు సాధించిన విద్యార్థులు ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ స్టూడెంట్ పెడరేషన్ సంస్థ (ఎపిఎస్ఎఫ్) వ్యవస్థపాక అధ్యక్షుడు రాఘవేంద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల మార్కుల జాబితా, పాఠశాల ట్రాన్సఫర్ ధ్రువీకరణ పత్రం, పాస్‌ఫొటో, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలతో జత చేసి మేనెల 26 తేదీలోపు అనంతపురంలోని ఎపిఎస్ఎఫ్ కార్యాలయంలో సమర్పించాలని కోరారు. పూర్తి వివరాలకు సెల్.. 99850 12181, 88850 12181 నెంబర్లను సంప్రదించాలన్నారు.

సాగునీటి సాధనకు సమైక్య ఉద్యమం

ప్రజాశక్తి-గుంతకల్లు

జిల్లాకు సాగునీటి సాధన కోసం సమైక్య ఉద్యమానికి సిద్ధం కావాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.జగదీష్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక బిటి పక్కీరప్ప భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ వై.శివరామరెడ్డి హంద్రీనీవాపై పరస్పర ఆరోపణలు, సవాళ్లు చేసుకోవడం సిగ్గుచేటన్నారు. ఇద్దరూ కలిసి జిల్లా రైతులకు సాగునీటి సాధన కోసం రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు కలుపుకుని సమైక్య ఉద్యమం చేయడానికి ముందుకు రావాలన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 3.50 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించాల్సిన అవసరం ఉందన్నారు. కనీసం 1.50 లక్షల ఎకరాలకు కూడా సాగునీరు అందడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం హంద్రీనీవా కాలువను వెడల్పు చేయడం స్వాగతిస్తున్నామని, అయితే కాలువలో జిల్లా రైతులకు సాగు కోసం నీరు వస్తుందన్న నమ్మకం లేదన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో సాగునీరు అందించే ప్రయత్నం కోసం రాజకీయాలకు అతీతంగా అందరూ కలసికట్టుగా ఉద్యమం చేయడానికి ముందుకు రావాలన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గోవిందు, నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, సహాయ కార్యదర్శి మహేష్, పట్టణ కార్యదర్శి గోపీనాథ్, సహాయ కార్యదర్శి గౌస్, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.మాణిక్యరావు

ప్రజాశక్తి-అనంతపురం

యోగా చేస్తున్న మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ వైద్య విద్యార్థులు

ప్రతి ఒక్కరూ యోగా చేస్తే సంపూర్ణ ఆరోగ్యం సాధమని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.మాణిక్యరావు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగాంధ్రలో భాగంగా శనివారం స్థానిక మెడికల్ కళాశాలలో ఏర్పాటు చేసిన యోగా తరగతులను ప్రిన్సిపాల్ ప్రారంభించారు. ఇందులో భాగంగా రేడియాలజీ పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రథమ సంవత్సరం విద్యార్థిని, యోగా మాస్టర్ ట్రైనర్ డాక్టర్ రిచారెడ్డి పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థులతో యోగాసనాలను వేయించారు. అనంతరం మాణిక్యరావు మాట్లాడుతూ ప్రాచీన కాలం నుంచి భారతదేశంలోనే ప్రారంభమైన పతంజలి మహర్షి రచించిన యోగా ద్వారా సంపూర్ణ ఆరోగ్యం అందరికీ లభిస్తుందన్నారు. అందుకే అనారోగ్యం పాలవకుండా రోజూ క్రమం తప్పకుండా గంటపాటు యోగా అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రేడియాలజీ ప్రధాన విభాగాధిపతి డాక్టర్ సురేష్, అనాటమీ ప్రధాన విభాగాధిపతి డాక్టర్ ఎస్.ఉమామహేశ్వరరావు, ఫోరెన్సిక్ మెడిసిన్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రమేష్‌బాబు, డాక్టర్లు పద్మ శ్రావణి, డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ నీరజ, డాక్టర్ కనపర్తి స్వాతి, డాక్టర్ జగదీష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు, ఫిజికల్ డైరెక్టర్ నరసింహనాయక్, పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థులు, హౌస్ సర్జన్లు పాల్గొన్నారు.

వైసిపి నాయకుడు మృతి

గుత్తి : వైసిపి సీనియర్ నాయకులు షేక్ చిన్న షేక్షావలి సాహెబ్ శనివారం మృతి చెందారు. వైసిపి ముస్లిం మైనార్టీ విభాగం మండల అధ్యక్షుడు హాజీ మలాన్ బాబా తండ్రి షేక్ చిన్న షేక్షావలి సాహెబ్ వయసు రీత్యా మరణించారు. విషయం తెలుసుకున్న వైసిపి పట్టణ అధ్యక్షులు కె.మధుసూదన్‌రెడ్డి, నాయకులు జి.గోవర్ధన్‌రెడ్డి, వై.సుభాష్‌రెడ్డి, విరూపాక్షిరెడ్డి, మహాలింగతోపాటు పలువురు భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

80 శాతం ఫీజు రాయితీతో శిక్షణ

అనంతపురం కలెక్టరేట్ : ఉమ్మడి అనంతపురం జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ఎఎఫ్ ఎకాలజీ సెంటర్ ఆధ్వర్యంలో 80 శాతం సబ్సిడీ ఫీజులతో జావాఫుల్ స్టాక్, పైథాన్, డేటా ఇంజనీరింగ్ కోర్సుల్లో నైపుణ్య శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ వైవి.మల్లారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఏ.ఎఫ్.ఎకాలజీ సెంటర్ అనంతపురము ఆధ్వరయంలో 6 నెలలపాటు నిరుద్యోగ యువతీ, యువకులకు జావా ఫుల్ స్టాక్, పైథాన్, డేటా ఇంజనీరింగ్ కోర్సుల్లో నిరుద్యోగులకు అత్యున్నత నాణ్యమైన నైపుణ్యత శిక్షణ, ఉపాధి అకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.

మూతబడిన 'గురుసాయి' పాఠశాల

ఉరవకొండ : ఉరవకొండలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలకు వెళ్లే దారిలో ఉన్న గురుసాయి ఇంగ్లీష్ మీడియం పాఠశాలను మూసివేస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి ఈశ్వరప్ప, పాఠశాల కరస్పాండెంట్ లోకనాథ్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరంలో సంబంధిత పాఠశాలలో ఎవరూ చేరకూడదని తెలిపారు.

వాహనాల తనిఖీ

పుట్లూరు : మండల కేంద్రం సమీపంలో ఎస్ఐ వెంకట నరసింహ ఆధ్వర్యంలో శనివారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఇందులో భాగంగా అధిక లోడుతో వెళ్తున్న వాహనాలను ఆపి కూలీలకు అవగాహన కల్పించారు. అలాగే డ్రైవింగ్ లైసెన్స్ రికార్డులు లేని వాహనాలకు అపరాధ రుసుం విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

గొల్ల భీమారెడ్డి మృతి తీరని లోటు

మృతునికి నివాళులర్పించిన బిటిపి ప్రాజెక్టు వైస్ ఛైర్మన్ సుబాన్

బ్రహ్మసముద్రం : మండల పరిధిలోని బుడిమేపల్లి గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు గొల్ల భీమారెడ్డి(58) మృతికి బిటిపి వైస్‌ఛైర్మన్ సుబాన్ నివాళులర్పించారు. భీమారెడ్డి అనారోగ్యంతో మృతిచెందిన విషయం తెలుసుకున్న సుబాన్ ఆయన స్వగృహానికి చేరుకుని భౌతికాయానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో డీలర్ రామాంజినేయులు, మాజీ డీలర్ తిప్పేస్వామి, సీనియర్ నాయకులు ఈశ్వరప్ప, గంగాధర్, గుండయ్యగారి తిప్పేస్వామి, కోడిపల్లి హనుమంతప్ప, తదితరులు ఉన్నారు.

తిరంగా ర్యాలీలు

గుత్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న గేట్స్ కళాశాల సిబ్బంది, విద్యార్థులు

గుత్తి : భారతదేశ సత్తా చాటిన సైనికులకు మద్దతుగా గుత్తిలో శనివారం గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో తిరంగా యాత్ర చేపట్టారు. ఇందులో భాగంగా పట్టణంలోని గాంధీ కూడలి నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్, ఎఒ ఇంతియాజ్‌బాషా, అధ్యాపకులు, బోధనేతర బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

పుట్లూరు : మండల కేంద్రంలో పార్టీలకతీతంగా ఆపరేషన్ సింధూర్, భారత సైనికులకు మద్దతుగా శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పుట్లూరు మండల ప్రజలు పాల్గొన్నారు.

బెలుగుప్ప : మండల కేంద్రంలో ఆపరేషన్ సింధూర్, భారత సైనికులకు మద్దతుగా శనివారం ర్యాలీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శివ, ఎంఇఒ మల్లారెడ్డి, టిడిపి జిల్లా కార్యదర్శి మల్లికార్జున, జనసేన మండల అధ్యక్షులు సుధీర్, బిజెపి మండల అధ్యక్షుడు మధు, సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, రిటైర్డ్ టీచర్ నాగరాజు, టీచర్లు తిప్పేస్వామి, ధనుంజయ నాయుడు,సుంకన్న, బాలాజీ, రాజు, మనోహర్,శ్రీరాములు,అనిల్, మంగలి ధనుంజయ, రాజేష్, వన్నూరుస్వామి, శివ, తదితరులు పాల్గొన్నారు.

జాయింట్ ఎల్‌పి నెంబర్లను తొలగించాలని వినతి

ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు

బొమ్మనహాల్ : మండల పరిధిలో చేపట్టిన రీసర్వేలో భాగంగా వచ్చిన జాయింట్ ఎల్‌పి సర్వే నెంబర్లను తొలగించాలని పలువురు రైతులు కోరారు. ఈమేరకు శనివారం మండల కేంద్రంలోని కార్యాలయంలో తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని 16 రెవెన్యూ గ్రామాల్లో సుమారు 30 వేలదాకా జాయింట్ ఎల్‌పిలు ఉన్నాయన్నారు. వెంటనే వాటిని తొలగించి సహకరించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో రైతులు సిద్ధలింగ, బోయ తిప్పేస్వామి, బోయ సావిత్రమ్మ, బోయ రామరాజు, బోయ గంగమ్మ, బోయ వన్నూరుస్వామి, తదితరులు ఉన్నారు.

'ఉపాధి' కూలీలకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

శింగనమల : ఉపాధి హామీ పథకం కింద పని చేస్తున్న కూలీలకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నప్పయాదవ్ డిమాండ్ చేశారు. శనివారం మండల పరిధిలోని కొరివిపల్లి గ్రామంలో చేపట్టిన ఉపాధి పనులను పరిశీలించి కూలీలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా కూలీలు పలు సమస్యలను నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న కూలి డబ్బులు చెల్లించాలని కోరారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ పెండింగ్ బిల్లులు చెల్లించడంతోపాటు పనులు చేసేచోట కనీస వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఓబుళపతి, నారాయణస్వామి, కుళ్లాయిస్వామి, వీరనారప్ప, ఓబిలేసు, దస్తగిరి, గంగేశ్వరి, నారాయణమ్మ, తిరుపాలు, ఓబిలేసు, హజీబు, టెక్నికల్ అసిస్టెంట్ సరస్వతి, ఫీల్డ్ అసిస్టెంట్ నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలి : ఎంపిడిఒ

ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపిడిఒ, సిబ్బంది

పెద్దపప్పూరు : ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి పెంచాల్సిన బాధ్యత తీసుకోవాలని ఎంపిడిఒ శకుంతల పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా ప్రతి ఒక్కరూ పచ్చని చెట్లను పెంచే బాధ్యత తీసుకోవాలన్నారు. చెట్ల వల్ల ప్రతి ఒక్కరూ స్వచ్ఛమైన గాలి పీల్చుకోవచ్చన్నారు. అలాగే ప్లాస్టిక్ వస్తువులను నిషేధించేందుకు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇకపోతే యోగాను ప్రతి ఒక్కరూ తమ జీవితంలో భాగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి రవికుమార్, వైద్యులు గంగరాజు, పంచాయతీ సెక్రటరీలు, సిఆర్‌పిలు, తదితరులు పాల్గొన్నారు.

డీలర్లతో మాట్లాడుతున్న సిఎస్‌డిటి రాజా

1 నుంచి రేషన్ పంపిణీ చేయాలి

ప్రజాశక్తి-పుట్లూరు

వచ్చేనెల 1వతేదీ ఆరు గంటల నుంచే రేషన్ పంపిణీని ప్రారంభించాలని సిఎస్‌డిటి రాజా సూచించారు. శనివారం మండల కేంద్రంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంతకుముందు ఎండి ఆపరేటర్లు పంపిణీ చేసేవారిని, 1వతేదీ నుంచి డీలర్లే స్వయంగా ఇంటి వద్దనే పంపిణీ చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ గోడౌన్ దగ్గరికి వెళ్లి తూకాలు వేసుకుని రావాలని సూచించారు. అనంతరం డీలర్లు మాట్లాడుతూ గోడౌన్ నుంచే బియ్యం తక్కువ తూకాలు వస్తున్నాయన్నారు. దీంతో తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. 50 కిలోల ప్యాకెట్ బియ్యం ఉండాల్సి ఉండగా 40 నుంచి 45 కిలోలు మాత్రమే వస్తున్నాయన్నారు. గోడౌన్‌లో మాత్రం 50కిలోల 300 గ్రాములు లెక్క లెక్క కట్టి పంపిణీ చేస్తున్నారన్నారు. కావున తమకు న్యాయం చేయాలని కోరారు.

ఘనంగా రోషన్‌షావలి ఉరుసు

కళ్యాణదుర్గం రూరల్ : కళ్యాణదుర్గం పట్టణంలో ఉన్న వన్నూరుస్వామి కొండలో శనివారం రోషన్‌షా వలి ఉరుస అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం స్వామివారిని ఊరేగించారు. అనంతరం స్వామిని కొండపైకి తీసుకెళ్లారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆంధ్రా కర్ణాటక ప్రాంతం నుండి పాల్గొనే భక్తులకు ఇబ్బందులు కలగకుండా పట్టణ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

సౌర విద్యుత్‌దే భవిష్యత్తు

అనంతపురం : జిల్లాలో విద్యుత్ ఉత్పాదక వనరుల్లో సౌరవిద్యుత్ ప్రథమ స్థానంలో నిలుస్తుందని ఐటిఐ ప్రభుత్వ బాలుర ఐటిఐ ప్రిన్సిపాల్ రామమూర్తి అన్నారు. శనివారం స్థానిక ఐటిఐలో ప్రధానమంత్రి సూర్య ఘర్ బిజిలి యోజన కార్యక్రమంలో భాగంగా కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు ముగింపు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర వనరులన్నీ ఎప్పుడో ఒకప్పుడు తప్పకుండా నశించిపోతాయన్నారు. సూర్యశక్తి ప్రపంచం ఉన్నన్ని రోజులు ఉంటుందన్నారు. కావున సౌరశక్తితో ఉత్పత్తి అయ్యే విద్యుత్తు, సంబంధిత కోర్సులకు మంచి అవకాశం ఉంటుందన్నారు. ఇందులో భాగంగా కోర్సు పూర్తి చేసిన 20 మంది అభ్యర్థులకు కేంద్ర ప్రభుత్వం అందించే సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో కోర్సు కో ఆర్డినేటర్ రామాంజనేయులు, అధ్యాపకులు రంజిత్‌కుమార్, ఉమాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్లతో విద్యార్థులు

నేరాలు ఘోరాలు

హరియాణా వాసి ఆత్మహత్య

ఆత్మహత్య చేసుకున్న సాయిద్‌ఖాన్

పెద్దవడుగూరు : మండలంలోని గుత్తిఅనంతపురం గ్రామ సమీపంలోని వంకలో శనివారం హరియాణ ప్రాంతానికి చెందిన సాయిద్‌ఖాన్ (25) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. లారీ డ్రైవరు అయిన ఇతను బెంగళూరుకు లోడుతో వెళ్తున్న సమయంలో ఇక్కడి జాతీయ రహదారిలో లారీని నిలిపి నడుచుకుంటూ ఇక్కడికి వచ్చి విద్యుత్ స్తంబానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. కుటుంబ సమస్యల కారణంగా ఇంటి వద్ద ఉన్న వారితో చరవాణిలో గొడవపడి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. ఘటనపై కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక టిప్పర్ సీజ్

శింగనమల : మండల పరిధిలోని కల్లుమడి గ్రామంలో సమీపంలో ఉన్న పెన్నానది పరీవాహక ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను శనివారం సీజ్ చేసినట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. కల్లమడి గ్రామం నుంచి ఎవరైనా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే వాహనాలను సీజ్ చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు.

కొడవండ్లపల్లిలో ఘర్షణ

యల్లనూరు : మండల పరిధిలోని కొడవండ్లపల్లి గ్రామంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన జయరామ కృష్ణ, శివకేశవ మధ్య కొంతకాలంగా భూ వివాదం నడుస్తోంది. సమస్య పరిస్కారం కాక మునుపే శివకేశవ తన పొలంలో బోరు వేస్తుండగా జయరామకృష్ణ అభ్యంతరం తెలిపాడు. దీంతో ఇరువురి మధ్య వివాదం చెలరేగింది. అనంతరం ఇంటికి చేరుకుని ఒకరినొకరు కర్రలతో దాడికి దిగారు. దాడిలో ఇద్దరూ గాయపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.